

# డి యస్ రాయుడు

‘‘పెదరాయుడు’’ అనే సినిమా చూశావా యశోధరా?’’ అనడిగింది వసుంధర.

‘‘పెదరాయుడూ చూడలేదు, చినరాయుడూ చూడలేదు వసూ. కాని డి యస్ రాయుడిని చూశాను. నువ్వు చూశావా?’’ అనడిగింది కొళాయి నీళ్లకొచ్చిన యశోధర.

‘‘యెవరాయన? వినలేదు. చూడలేదు. నీదంతా చోద్యం. మా అత్తగారు నన్ను బయటికి పోనిస్తుందీ?’’

‘‘ ఆయన మాటలే చోద్యంగా వుంటాయి. మనిషీ అంతే ఓనాడు చూసి వద్దాం. ఇంటిచుట్టూ పెద్ద తోట పెంచాడు’’.

‘‘నీళ్లు పట్టుకున్నావా? పోనా? సందె ముగ్గు బెట్టాలి. అత్తగారు కూతుర్ని చూసి వస్తానని వెళ్లారు. ఆమె రాకముందే, అస్తమయం కాగానే వేయాలి’’.

‘‘యేమంటుందేం అత్తగారు?’’ నీళ్ల బిందె నడుమున వుంచుకుని చోద్యం పడుతూ అడిగింది యశోధర.

‘‘నీది కాన్వెంటు చదువై పాయె. నీ కర్థంగాదేమో’’ అలా అంటూ వెళ్లి ముగ్గు గిన్నె, చిన్నబకెట్‌తో నీళ్లూ, దానిలో ప్లాస్టిక్ లోటా తెచ్చింది వసుంధర.

‘‘నా కళ్లు నెత్తికెక్కాయంటావా? నాకు గ్రానా? మాతృభాష రాదంటావా?’’ యశోధర అరిచింది.

‘‘కోపమెందుకూ? ముక్కు నలిపి దీపం పెట్టి ముగ్గ్ర వేయమని చెప్పలేదే కోడలా? అసుర సంధ్య వేళా సెమ్మాలాగా నిలబడ్డావేం’’ అంటుందత్తగారు. అయిపోలా’’ యిదేం పిల్లలో? యెంత వుద్యోగస్తురాలైతే మాత్రం, ఆడజన్మేగా, దగ్గర్నుంచుని పని చేయించాలా? పనిమనిషా? యింటి మనిషి గాదూ?’’ అని దవడలు నొక్కుకుని తానే ముగ్గ్ర వేయటానికెళ్తుంది’’.

ఇద్దరూ వీధిలో కొచ్చారు. ఆకాశం ధూసరవర్ణంలో కొచ్చింది. పక్షులెగురుతూ గూళ్లకు చేరుతున్నాయి. యశోధర గడపలు కడిగి, వీధి చిమ్మి నీళ్లు చల్లి సందె ముగ్గు పెట్టింది.

యెదురుగా ఖాళీస్థలంలో పిల్లలాడుతున్నారు.

''సుబ్బారాయుడి పెళ్లీ, చూసీ వద్దాం రండీ, దొరగారింట్లో పెళ్లీ దోచుకొద్దాం రండీ. మా వాళ్లింట్లో పెళ్లీ మళ్లీ వద్దాం రండీ''. యిద్దరు పిల్లలు యెగురుతూ చేతులు తాకిస్తూ ఆడుతుంటే యిద్దరు పిల్లలు '' ఒప్పుల కుప్పా'' అని పాడుతూ చేతులు మెలిక వేసి కలిపి పట్టుకుని గిర్రున తిరుగుతున్నారు. ముగ్గురు పిల్లలు '' సీలామండా చిక్కుడుకాయి'' అని ఒక కాలు మరొకరి కాలిమీద మెలివేసి ఒంటి కాలిమీద గెంతుతూ చప్పట్లుకొడుతూ తిరుగుతున్నారు.

వసుంధర వెళ్లి, ''సుబ్బారాయుడు గారింటి పేరేమిటి శాంతా?'' అనడిగింది.

ఆ పిల్ల నవ్వి నోటిమీద చెయ్యి వేసుకుని పారిపోయింది. ఆ పిల్ల జతకత్తె పరుగెత్తి పోయింది.

''నీకూ తెలీదూ?'' అనడిగింది యశోధర.

''తెలియకే అడిగాను'' అని లోపలికి దారితీసింది. తులసి కోట గూటిలో దీపముంచి, లోపల కులదైవం వెంకటేశ్వరుని ముందు దీపముంచి, వూదొత్తి వెలిగించి, వరండాలోకొచ్చి లైటు వేసింది వసుంధర ''మళ్లా వస్తా వసూ'' అని నీళ్ల బిందె యెత్తుకున్నది యశోధర.

## 2

''వ్రతానికి పూలు కావాలి. ఇవాళ వాకిట్లోకి పూలబ్బాయి రాలేదు. నిన్నా రాలేదు. బజారు దూరం. పోనీ వెళ్తే పూలమ్మేవాడు, తునిగినవీ, విచ్చినివీ, వేసి, నాలుగు మంచి పూలేసి పాతిక పూలూ నాలుగురూపాయలంటూ ఆకు పొట్లం అందిస్తాడు'' అంటూ వచ్చింది యశోధర.

''రాయుడుగారు పూలతోట పెంచుతారని విన్నా. కాసిని పూజకు కోసుకోనివ్వడా?'' పట్టుచీర యిస్త్రీ చేస్తున్నది వసుంధర.

''యివ్వడనే విన్నా. రేపే పూజ. పనికాగానే వచ్చాను''.

''అడిగితే యేం పోయిందీ? యిస్తే యిస్తాడు లేకపోతే లేదు. నాకూ కావాలి. పోయి ప్రయత్నిద్దాం రా. పని అయిపోయింది'' మీట ఆఫ్ చేసి, ప్లగ్ పీకి, ఇస్త్రీ పెట్టె పీటమీద నిలబెట్టి వచ్చింది వసుంధర.

ఇద్దరూ పూలసజ్జలు పట్టుకుని తలుపు తాళం పెట్టి బయలుదేరారు. ఇంకా సూర్యాస్తమయం కాలేదు. డూప్లికేట్ తాళం చెవి వసుంధర భర్త నాగరాజు దగ్గరున్నది. రెండు వీధులు దాటి మూడవ వీధిలో, యిళ్ల మధ్యగా వున్న యింటివేపు వెళ్ళారిద్దరూ. యెత్తైన ప్రహరీ గోడపైకే మందార పూలు గాలికి వూగుతూ కంటబడ్డాయి. సంపెంగ వాసనలు ఆహ్వానించాయి తలుపు నెట్టితే విడబడింది.

రాయుడు వరండాలో పేము కుర్చీ వాలుకుర్చీలో వాలి దినపత్రిక చదువుతున్నాడు. తలుపు చప్పుడు విని, పత్రిక మడిచి, పక్కకి చూశాడు. లేచి నిలబడి పత్రిక బల్లమీద పడేశాడు. చేతులు వెనక్కి పెట్టుకున్నాడు. నవ్వు మొహం, తెల్లని పైజామా లాల్చీ, నల్లని ఒత్తైన క్రాపూ.

జతకత్తెలిద్దరూ మందగమనంతో వచ్చి మెట్లకింద నిలబడ్డారు. వారి చేతిలో పూలసజ్జలు చూడగానే రాయుడు,

''పూలకోసవూ? నేను పూల తోట పెంచేది పూలు చూసి సంతోషించటానికి, పూజకు గాదు'' అన్నాడు.

''అవుననుకోండి. అన్ని పూలూ చిటుకూ చిటుకూ కోసేయంగా. అన్నీ పనికిరావు గూడాను పూజకి'' అన్నది వసుంధర.

వాళ్ల వెనకాలనించి, తీసి వున్న వాకిలిగుండా యిద్దరు పురుషులు చేతులెత్తి పలకరిస్తూ వచ్చారు.

''హలో! రాయుడూ! అంతా బావున్నారా?'' అని పలకరించాడు ఆనందరావు.

''నీ తమ్ముడు పెళ్లాడాడనీ, నువ్వు సాక్షిగా వెళ్లావనీ అన్నారే. నువ్వు గూడా అటువంటిదేదో కానీరాదూ'' అన్నాడు వాసుదేవరావు.

''రండి. రండి. అటువంటిది కానిస్తే కాలనీలాగా వుంటుంది'' అని ఆహ్వానించాడు రాయుడు.

చెలికత్తెలిద్దరూ ఒకరినొకరు చూసుకుని, కళ్లతో సైగలు చేసికొని పూలచెట్ల వేపు వెళ్లారు.

ముద్దమందార, రేక మందారా, గన్నేరు, సువర్ణ గన్నేరూ, కాశీరత్నం, విష్ణుక్రాంత, వేయి వరాలూ, గరుడమల్లె, నిత్యమల్లె, విరజాజి, పెద్ద జాజి, సన్నజాజి, సంపెంగ, గోడవారగా పారుజాతం, మరొకవేపు దిల్‌బహార్, కనకాంబరం, నైట్‌క్వీన్, డే క్వీన్ లిల్లీపూలూ, మల్లె తీగ, నాగమల్లి ఆహ్వానించాయి. వీళ్లిద్దరూ పూలు కోస్తున్నారుగానీ, మాటలు వినబడుతుంటే అటూ చూస్తూ వింటున్నారు. ములుగోరింట విరియబూసింది.

ముగ్గురూ కుర్చీల్లో ఆసీనులైనారు.

''మా పెద్దమ్మాయి కూతురుతో సహా వచ్చింది. నోము నోయాలిట. ఆ అయిదేళ్ల మనమరాలు బొమ్మల పుస్తకాలు కావాలని మారాము. లేదా తనతో ఆడమంటుంది. నాకు ఓపికేదీ? కోర్టునించి రాగానే దీనితో ఆడగలనా? నీ దగ్గర చాలా వుండాలే. అద్దాల బీరువాలో చూశాను. నాలుగివ్వు'' అన్నాడానందరావు అడ్వొకేటు.

'' ఆ. యిస్తా. నా మేనగోడలికీ అదే వయస్సు యింకా తక్కువేనేమో. ఇంగ్లీషు నేర్చుకోమని కొనిస్తే ఆ పుస్తకంలోవి నేర్చి, దానిపై పుస్తకం గూడా చదివింది''. ఇంకా కావాలి కొనివ్వు'' అని పరుగెత్తుకొచ్చింది'' అభినయిస్తూ చేతులాడిస్తూ నవ్వాడు రాయుడు.

''యెవరు నేర్పారు అల్పబెట్సూ?'' అనడిగాడు వాసుదేవరావు. ఆయనకి తైరుపోయటం అలవాటు.

''మా చెల్లెలే. అది ఫస్ట్‌ఫారమ్ చదివేప్పుడు, పరీక్షలో, రామా యీజ్ టాలర్ దేన్ కృష్ణా అనే వాక్యాన్ని తిప్పిరాయమంటే, కృష్ణా యీజ్ షార్టర్ దాన్ రామా అని రాసేసింది. అహహా! గ్రామర్ పేపరంతా అలా పూర్తిగా రాసేసింది నా చెల్లెలు'' అని నవ్వాడు. మిత్రులు నవ్వారు. వాసుదేవరావు అడిగాడు.

''రాయుడూ! కొబ్బరి బోండాలు దింపిన వున్నాయా? నాలుగిద్దూ. మా దొడ్లో కొబ్బరిచెట్లు యేనాటివో ఆకాశంలో కెదిగిపోయి చాలా పైకి గుత్తి కనబడుతున్నది. కోసేవాడందలేదు. దొడ్లో చెట్లుండగా కొనటమేమిటంటుంది యింటి యిల్లాలు''.

'' ఆ. కోసినవున్నాయి. యిస్తా. మా అన్నాయి కొడుకు హనుమంతు, నిజంగా హనుమలాగా, నిమిషంలో చెట్టు పాకి, కాళ్లకీ నడుముకీ తాళ్లక్కర్లేదు, బోండాలు గిరగిరా తిప్పి కిందబడేస్తాడు. కొడవలి గూడా అక్కర్లా. కాలు జారితే అంతెత్తునించీ కిందబడుతావురా అని కేకవేస్తే నవ్వుతాడు. 'పడను బావాయ్!'' అని యికిలిస్తాడు కోతిలాగా. సంతోషంగా నవ్వాడు రాయుడు.

రాయుడు అభినయం చూస్తూ వాసుదేవరావూ మెప్పుగా నవ్వాడు. బోండాలిస్తానన్నాడుగా.

ఇరుగు పొరుగు పిల్లలు నలుగురు వచ్చారు.

''బాబాయి గారూ! కాసేపు కారమ్స్ ఆడుకోమా?'' చేతులు కట్టుకు నిలబడి అడిగారు.

''లోపలికి పొండి. బోర్డు తెచ్చుకోండి. కాయిన్సు పెట్టె అల్మరలో వుండాలి. చూసి తెచ్చిస్తా. చాక్‌పౌడర్ డబ్బా బోర్డు పక్కనే వుంటుంది. పౌడరు చల్లనిదీ ఆడరాదు. కాయిన్సు కదలవు'' అని లేచి వెళ్లాడు.

రాయుడు వచ్చేప్పటికి, పిల్లలు బోర్డు వాల్చి, వలలు దులిపి, పౌడరు చల్లి

నాల్గువేపులా కూచున్నారు. కాయిన్స్ పెట్టె అందగానే దులిపి, బోర్డు మధ్య అమర్చి ఆడసాగారు.

చూస్తున్నారు ఆట. ‘‘ ఆట బాగా వచ్చుల్లే వున్నది’’ అన్నాడానందరావు.

‘‘మా అన్నాయి టాన్‌జెంట్ బాగా కొడతాడు. కాయిన్ నెట్లో పడాల్సిందే. మా పిన్ని కొడుకు దత్తుకి మరీ బాగా వచ్చు. మూడు రౌండ్సులో ప్రత్యర్థిని ఓడిస్తాడు. వాడిదృష్టి యెప్పుడూ రెడ్ కాయిన్ మీదే వుంటుంది. దాన్ని యెదుటి వాడికి వదలడు. అసలందనివ్వడు’’.

‘‘చాక్‌పౌడరయిపోయింది బాబాయిగారూ’’.

‘‘డబ్బా పారేయనా?’’ శామసుందర్ అడిగాడు.

‘‘పారేయద్దు. మా అమ్మ పనికిరానివన్నీ యేదో విధంగా వాడుకుంటుంది. దాంట్లో సున్నిపిండి పోసి స్నానాల గదిలో పెడుతుంది లేదా మట్టి పోసి చిన్న తులసి మొక్కవేసి వంటింట్లో కిటికీలో పెట్టి పెంచుతూ దణ్ణం పెట్టుకుంటుంది’’.

‘‘అడుగున చిల్లులుండద్దూ?’’ శీను అడిగాడు.

‘‘ ఆవిడే షోగ్గా మేకుతో చిల్లులేసి మట్టిపోస్తుంది. ఇంకా అందంగా వుండాలని టీ పొట్లాలలో వెండి కాగితం పారేయకుండా దాని చుట్టూ చుట్టి అతికిస్తుంది. పట్టుచీర పీలిక లేదా జరీ అంచు చినిగినదీ తెచ్చి భలే షోగ్గా చుట్టుతుంది వాజులాగా కనబడుతుంది’’. అభినయంకంటె నవ్వు బాగుంటుంది రాయుడుగారిది.

మరో యిద్దరు వచ్చారు. ‘‘రండి, రండి’’ అని ఆహ్వానిస్తూ కుర్చీలు చూపాడు రాయుడు.

‘‘ ఓ రౌండ్ రమ్మీ ఆడదామా రాయుడూ? ఇంటినిండా ఆడవాళ్లు చేరారు. ముద్దకుడుములని ఫంక్షన్‌ట మనమడికోసం. చోటులేదు. బెడ్‌రూమ్‌లో వేడి. ఇక్కడ చల్లగా వుండి పూలవాసనలు’’. ఇద్దరూ ఆసీనులైనారు. కాంతారావు కోర్టులో కాపీయింగ్‌మాన్. జనార్ధనం హెడ్‌గుమస్తా.

''అలాగే పేకతెస్తా'' అని హుషారుగా లేచి వెళ్లాడు.

మళ్లా వచ్చి మధ్యగా గుండ్రని బల్లమీద రెండు పేక ప్యాకెట్లుంచి, ఒకటి విప్పాడు. షఫుల్ చేసి కాంతారావుని కోయమన్నాడు రాయుడు.

వినోదం చూస్తున్నారు. జనార్ధనం అన్నాడు.

''మా పిన్ని కోడలు, పిన్ని యాత్రకెళ్లిందిలే రాయడూ, పిల్లకి పెద్దబిడ్డ చేష్ట వచ్చిపోతే, పోయిందని తెలియక డాక్టరు దగ్గరకి తీసికెళ్లింది. ఇదీ చదువు చేసిన మేలు''. రాయుడు ''అయ్యో!'' అనకపోగా పకాపకనవ్వుతూ '' ఆ అమ్మాయి కొంతమంచిపనే చేసింది. మా పిన్ని కూతురు చచ్చిపోయిన మూడునెలల పిల్ల మీద బుట్ట బోర్లించి, డాక్టర్ని పిలుచుకొచ్చి చూడమన్నది. అహహ్. డాక్టరు బుట్ట తీసి చూసి ధడుసుకున్నాడు. ''మందు అక్కర్లా బిడ్డ దివికేగింది. నిన్ను సైకియాట్రిస్టుకి చూపాలిరా'' అని లాక్కెళ్లాడు. అహహ్!'' అని నవ్వి ''రెండు పేకలు కలపనా?'' అనడిగాడు.

''అక్కర్లా. ముగ్గురమేగా'' అన్నాడు జనార్ధనం.

''రాయుడితో జాగర్తగా ఆడాలి'' అన్నాడు కాంతారావు.

''యేం?'' అనడిగాడు జనార్ధనం. ముక్కలందుకుని పేర్చి సెట్ కుదిరిందా అని చూస్తున్నాడు.

'' ఒక్క రౌండ్ తిరిగేప్పటికే రాయుడికి అన్నీ కరతలామలకం. యెవరి చేతిలో యేమున్నయ్యో తెలుసుకోగలడు. నీక్కావాల్సిన ముక్క వదలడు. నీకు సెట్టుగాక మరో సెట్ తయారు చేయాలని ముక్కలు పారేస్తావు. నేను అనుభవం మీదే చెపుతున్నా. నువ్వు రాయుడికి కుడివేపున్నావు. ఓసారి యెంతకీ సెట్ కుదరక అనుమానం వేసి నా వెనకాల నిలువుటద్దమున్నదేమోనని వెనక్కు చూశాను సుమా. డబ్బు పెట్టి గూడా ఆడతాడు నీకు తెలుసునో తెలియదో''.

''చిన్నప్పటినించే అలవాటా పేక? రాయుడూ? చదువేమయేదీ? పేకాటగూడా గాంబ్లింగే. మీ నాన్న చూస్తే తిట్టేవాడుగాదూ?''

కాంతారావడిగాడు.

''యెట్లాగో తిడతాడు. పైకమడిగినంత అనే పద్యమున్నది గదూ. వున్న వూళ్లో చదువులేక వేరే వూళ్లో పెడ్తే డబ్బు పంపమని రాస్తే యింతెత్తు నెగిరిపడతాడని, మా అమ్మ చెప్పింది. మా అన్నాయియా పట్నం నించి వుత్తరం పడేయగానే, వాడేమో డబ్బు కావాల్సినప్పుడే వుత్తరం పడేస్తాడుట, అదీ యెగిరిపడటానికి దోహదం చేసేదిట''.

''జీతానికీ హాస్టల్ ఫీజుకీ పంపితే చాలదా? వీరి వినోద విలాసాలకీ పంపాలా?'' అని యింకా పైకెగిరే వాడట''. రాయడభినయిస్తూనే వున్నాడు. సెట్ పూర్తయిందని వెల్లికలా పెట్టాడు నవ్వుతూనే వుంటాడు.

''మేం గమనించనే లేదు రాయడూ, నీ మాటలు వింటూ అభినయం చూడటంతో ముక్కలు చూసుకోలేదు'' అన్నాడు జనార్ధనం ''అన్నీ కూడనా బొమ్మకి పదిగదూ?'' అన్నాడు.

''ఫరవాలేదులే కాంతారావ్! డబ్బు పెట్టి ఆడలేదుగా''.

''నీకూ ముక్కల వెనక గుర్తులు చూడటం అలవాటేమో రాయడూ!'' అని హాస్యమాడాడు.

''గుర్తులెలా వుంటాయో!'' అని ఆశ్చర్యపోయాడు జనార్ధనం.

''గోటితో నొక్కి గీతపడేట్టు చేస్తారు. చివర వంచి మళ్లా సరిగా చేసి కలిపేస్తారు'' కాంతారావు నవ్వాడు.

''అందుకే నా మిత్రులు'' వీడు గోటితో ముక్కల మీద గుర్తులు పెట్టి గుర్తించి వోడిస్తున్నాడని అనుమానించి, పేక నలగకముందే, మాయకముందే, కొత్తపేకపైకి తీసేవాళ్లు. ''మరీ మంచిది'' అనుకున్నా. రాయడు నవ్వుతూనే మళ్లా ముక్కలు కలిపి షఫుల్ చేసి కోయమని పంచసాగాడు.

''పాతవి వుంటే మా యిద్దరికీ చెరోటీ యివ్వు రాయడు'' అన్నాడు జనార్ధనం. ''పిల్లలతోనన్నా ఆడతాము''.

''అలాగే'' నిమిషంలో లోపలికెళ్లి అల్మరలోని రెండు పాతపేక పెట్టెలు తెచ్చి బల్లమీదుంచాడు రాయుడు. ముక్కలు జాగర్తగా అమర్చుకుంటూ కాంతారావడిగాడు, ''డబ్బు పెట్టి యెందుకాడేవాడివీ? కోల్పోవూ?''.

'పట్టుదలా జాగర్త హెచ్చుతుంది, మిత్రమా. ఓసారి టెన్నీస్ కోర్టుకున్న గోడవారగా తడిక వెనకాల కూచుని ఫ్రెండ్స్‌తో ఆడుతున్నాను. ఫ్రెండ్ సిగరెట్ పూర్తిచేసి చూడకుండా విసిరేశాడు. యెండి పాతదైన తడిక అంటుకుని నిమిషంలో తగలబడింది. నలుగురం నివ్వెరపోయాం. కోర్ట్ క్లీన్ చేసే స్పోర్ట్స్ ప్యూన్ వెళ్లి ప్రిన్సిపాల్‌తో నా మీద నింద వేసి చెప్పాడు. ప్రిన్సిపాల్ బ్రహ్మచారి''.

''కొత్త తడికకొని అక్కడ నిలబెట్టించు రాయుడూ. లేకపోతే ఫైనల్సు రాయనివ్వను. పరీక్షలు వచ్చేస్తున్నాయి'' అని ఆర్డర్ వేశాడు. టెన్నీస్ బంతి పొట్టి గోడ అవతలికి పడకుండా యెత్తుగా తడిక పెట్టించాడట. మా నాన్నకు వ్రాసే అవకాశమేలేదు. అది చదివి మా నాన్న తడికకంటె పైకి యెగురుతాడేమో'' రాయడు నవ్వితే మిత్రులూ నవ్వారు.

''అదుగో అప్పుడు నిజంగానే పరీక్ష వ్రాయనివ్వడేమోననే భయంతో పట్టుదలగా గుర్తుంచుకుంటూ ఆడి డబ్బు గెలిచి తడిక పెట్టించా'' గర్వంగా చూస్తూ నవ్వాడు రాయుడు.

''చదువు పాడుగా లేదూ?'' కాంతారావడిగాడు.

''లేదు. రాంకూ. క్లాసూ రాకపోతేనేం గ్రూపులో ఫస్ట్ వచ్చా''.

పొద్దాక వస్తున్నది. యెదురింటి జానికమ్మ, మనమడిని చంకనేసుకుని వచ్చేసింది.

మెట్లకింద నిలబడి వూగుతూ అడిగింది.

''వంటవేళైంది తమ్ముడూ. వీడికి పాలవేళా. పాలు వెచ్చబెట్టి పట్టాలి. అగ్గిపెట్టె అయిపోయింది చూసుకోలేదు. స్టౌ వెలిగించే మెషీన్‌తో స్టౌ వెలగలేదు. అదీ పూర్తయిందేమో. పక్కింటామె లేదనేసింది. అగ్గిపెట్టె వుంటే యియ్యి.

కొనగానే నిండుపెట్టె పంపుతా''.

రాయుడు లేచి వెళ్లి అగ్గి పెట్టె తెచ్చి ఆమె దోసిట్లో పడేసి వచ్చి బోర్లించిన ముక్కలు తీసుకున్నాడు.

'' ఆమె నెందుకు రానిస్తావు రాయుడూ? నోరు పెద్దది. దాష్టీకం జాస్తీ. కోడల్ని నోరెత్తనివ్వదు'' జనార్ధనం అన్నాడు.

''నేనేం రమ్మని పిలవలేదు. అడిగినవన్నీ యిస్తాననను లేదు. మా అమ్మ మేనమామ పెళ్లామూ అంతే. ఆమే వచ్చేస్తుంది. కూతురు పేరు మాచమ్మ. ''మాచీ!'' అని పిలుస్తూ పనంతా చేయిస్తుంది. నోరెత్తనివ్వదు. మా అమ్మ అన్నది. '' ఓ యమ్మో! యీ అనుమాయమ్మత్త కూతుర్నే యిలా రాచి రంపాన పెడుతున్నదే. రేపు కోడలొస్తే దాని గతేమిటో. మామయ్య నోరులేని జీవుడు. సంపాదించి పోస్తాడంతే''.

కాని అనుమాయమ్మ కోడల్ని ప్రేమగానే చూసింది. ఆ కోడలు జబ్బు పడింది. ''మీరే నాకు తల్లి. నేను పోను. మా అమ్మ సాధించి పోస్తుంది'' అని కౌగలించుకునేడ్చింది కోడలు. అనుమాయమ్మ వోదార్చి, సద్ది చెప్పి, ''నిజమేనందాము కోడలా! కాని వైద్యానికి డబ్బేది అనురాధా! మీ వాళ్లకు చాలా వున్నది. మంచి వైద్యం చేయిస్తారు. నే చెప్తాలే ''పిల్లనేమనకండి వదినగారూ, ఖర్మ బాగా లేక జబ్బు పడింది'' అని. తానే కోడల్ని పుట్టింట్లో దింపి వచ్చింది. అదీ గమ్మత్తు'' అని బాగా నవ్వాడు.

మిత్రులూ నవ్వారు. ''సరీగ్గా స్త్రీలన్నట్టే బాగా అనుకరిస్తూ బొమ్మ కట్టేట్టు చెపుతావు రాయడూ అదీ విశేషం. మళ్లీ చూపించావే. ఖబుర్లు చెప్తూనే వున్నావు''.

పిల్లలు నలుగురూ లేచి, కారమ్స్ బోర్డు లోపలి గోడకానించి వచ్చారు. కాయిన్సు పెట్టె యెదురుగా వుంచారు.

''పోతాం బాబాయ్'' అని పరుగెత్తారు.

''మేమూ పోవాలి మిత్రమా బోండాలిప్పించు'' అన్నారు. రాయడు

లేచివెళ్లి బోండాలు సంచీలో వేసి తెచ్చాడు. కూచుని పేక సర్దేస్తున్నాడు. లైట్లు వెలిగినై.

కాంతారావన్నాడు. ‘‘ ఆ జానికమ్మ పింతల్లి పోయిందిట. కర్మలకెళ్లి వచ్చి చెప్పింది మా అమ్మతో’’ కాకికి యెంగిలి చేయి విదిలించి యెరగదు. కట్టుకు పోయిందా?’’ అని అరుస్తూ పింతల్లి పిసినారి అని తేల్చింది’’.

‘‘మీ పిన్ని హార్ట్ ఎటాక్ వచ్చి పోయిందని అన్నారే!’’ అన్నాడు జనార్ధనం.

‘‘ మా పిన్ని మొగుడు, కొడుకూ పోయినా , ఆస్తికి తానొక్కతే వారసురాలైనా, వున్నవాళ్లూ మేనళ్లుళ్లకీ, మేనగోడళ్లకీ, అక్క పిల్లలకీ, మనమలకీ పెట్టుకుంటూ, ఆస్తి తరగకుండా చూసింది. నోములు వ్రతాలు చేసుకున్నది. పోతానని తెలియంగానే తన కర్మలకు కావాల్సింది వుంచి పొలము యిల్లు బావగారి పిల్లల పేర రిజిష్టర్ చేయించి యిచ్చేసింది పిన్ని. ‘‘వాళ్లదే ఆ ఆస్తి వాళ్లకే చెందాలి’’ అని పోయింది మా పిన్ని.

అంతా వెళ్లిపోయారు. నిలబడి చూస్తున్నాడు. చెలికత్తె లిద్దరూ పూల సజ్జలతో వచ్చారు.

‘‘పోతామండి. థాంక్స్’’ అన్నారిద్దరూ.

‘‘ ఆ కాసినే యిందాకటినించీ కోసినపూలూ!’’ అని నవ్వాడు రాయడు.

3

ఇంట్లో అడుగుపెట్టేప్పటికి అత్తగారు పులిలాగా యెదురైంది.

‘‘యెక్కడికెళ్లావే కోడలా? పూలకోసమేనా? రాయుడింటికేనా వెళ్లిందీ? ఇది తీసికెళ్లిందా? దానికింట్లో కాలు నిలవదు. నీకూ అలవాటు చేస్తున్నదీ? ఆ డబ్బా రేకుల సుబ్బారాయుడు నవ్వులు ఒలకబోస్తూ మత్తు చల్లి యెదుట్నించి పోనివ్వడు. ఉండు గుర్తుండేట్లు చేస్తా’’ అని లోపలికెళ్లిందత్తగారు.

ఇద్దరూ నోరు వెళ్లబెట్టారు. యశోధర నవ్వుతూ రహస్యంగా అన్నది. ‘‘నే పోతా వసూ! మా అత్తగారేం చేస్తుందో’’ అని చల్లగా జారుకున్నది.

వసుంధర నిలబడింది. అత్తగారు చీపిరి తిరగేసి పట్టుకొచ్చింది. ''యేదే అది?'' అని అరిచింది.

బెడ్‌రూమ్‌లోంచి భర్త నాగరాజు వచ్చాడు. మొదట అర్థంగాక నిలబడ్డాడు. భార్య బేలలాగా చూసింది.

''చూశావురా నాగా! యీ కోడలు యేదో మిషపెట్టి ఆ డబ్బా రేకుల వాడింటి కెళ్తున్నది. వాడికి పెళ్లీ పేలాలూ లేవు. యశూ దీనికి వత్తాసూ'' అని వురిమింది తల్లి. కొడుకు నవ్వాడు.

''వాడింటికి వెళ్లకుండానే కట్టడి చేస్తాలేమ్మా'' అని చీపిరి లాక్కుని అటక మీద పెట్టాడు నాగరాజు. తులసి గూట్లో దీపం పెట్టుకో'' అని తోలేశాడు తల్లిని. భార్యను బెడ్‌రూమ్‌లోకి నడిపించుకెళ్లాడు. సజ్జ బల్లమీదుంచి నవ్వుతూ అన్నాడు.

''నీక్కావాలంటే నేనంతకంటె బాగా డబ్బా వాయించగలను వసూ. వినలేవేమోనని వినపించలేదు. రేపు వ్రతానికి పూలు కొనుక్కొచ్చా. అదుగో పొట్లాం. ఆకులూ వక్క గూడాను. కర్పూరం, వూదొత్తులు. అన్నీ రెడీ. పద నాకివాళపని వత్తిడి వుండి ఆలస్యంగా వచ్చా. అమ్మాయిప్పుడే వచ్చింది. గుడ్డలు మార్చుకోవాలి నేను. నువ్వు కాఫీ చేసి తీసుకురా. ఊరికేనే అంకెలు వేస్తుంది గానీ మా అమ్మేం చేయదు. పూజకు బ్రాహ్మడిని రమ్మని చెప్పేదా? వాడికి ఫోనున్నది. నువ్వే పుస్తకం చూసి పూజచేసుకుంటావా. పోనీ నేను చదవనా? చదివే ఆఫీసుకి వెళ్తా'' అని మేజోళ్లు వూడదీస్తూ కుర్చీలో కూచున్నాడు.

వసుంధర వంటింటివేపు వెళ్లింది.